Namasthe Telangana Dt 03/09/17

# హరిత రక్షణలో మెట్రోరైలుకు ఆరు అవార్డులు



మెట్రోరైలు అధికారులకు అవార్డు అందజేస్తున్న వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: పర్యావరణ పరిరక్షణకు పాటుపడడంతోపాటు నగర అందాలను ద్విగుణీకృతం చేసిన మెట్రోరైలు ప్రాజెక్టుకు గార్డెన్ ఫెస్టివల్‌లో ఆరు అవార్డులు దక్కాయి. ఈ అవార్డులను వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సీ పార్థసారథి చేతుల మీదుగా మెట్రోరైలు హార్టికల్చర్ టీం చీఫ్ ఎస్ సాయినాథ్ అందుకున్నారు. ఓవరాల్ ఇన్నోవేటివ్ థీమ్ ఆఫ్ గార్డెన్ ఫెస్టివల్ ఫర్ ది ఇయర్ 2017కు తెలంగాణ అమరవీరుల మెమోరియల్ కప్, బేగంపేట మెట్రోరైలు భవన్ బ్యూటిఫికేషన్‌కు కుర్ర పుల్లయ్య రోలింగ్ కప్, మెట్రోరైలు భవన్‌లో గ్రీన్ ఎన్విరాన్‌మెంట్‌కు మొదటి బహుమతి, నాగోల్, ఉప్పల్ మధ్యలో వయాడక్ట్ బ్యూటిఫికేషన్‌కు ప్రథమ బహుమతి, మియాపూర్‌లోని హెచ్ఎంఆర్ఎల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో గ్రీన్ ఎన్విరాన్‌మెంట్ క్రియేట్ చేసినందుకు మొదటి బహుమతి, సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్, జింఖానా గ్రౌండ్ సమీపంలో రోడ్డు పక్కన చేపట్టిన అందాలకు ద్వితీయ బహుమతి లభించింది.

**నగరంలో పెద్ద మొత్తంలో మొక్కలు నాటాం: ఎన్వీఎస్ రెడ్డి**

మెట్రోరైలు కారిడార్లలో బ్యూటిఫికేషన్ కాకుండా నగరంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటామని మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. మెట్రోస్టేషన్లతోపాటు, వయాడక్ట్స్ కింద, మైదాన ప్రాంతాల్లో 8 లక్షల మొక్కలు నాటినట్లు చెప్పారు. ఐదేండ్ల నుంచి వేలకొద్దీ ప్లాంట్లను ట్రాన్స్‌లోకేషన్ చేసినట్లు వివరించారు. మరో 5 లక్షల మొక్కలను నాటుతున్నట్లు చెప్పారు, వీటితో పాటు మరో 25 వేల మొక్కలను మెట్రో వయాడక్ట్ కింద నాటుతామన్నారు. ఈ సందర్భంగా అధికారులను ఎన్వీఎస్ రెడ్డి అభినందించారు.